# కొమ్మ కొమ్మకో సన్నాయి!

శ్రీ కందుకూరి లింగరాజు

[గతసంచిక తరువాయి]

పళ్ళెం బల్లమీద పెడుతూ, "నేను సర్దిపెడతానులే! అంతకోపం ఎందుకూ నామీద" అనేసేడు ప్రక్కగా చతికిలబడుతూను.

ఆ సిల్కు చీరలు మడతలు పెట్టడం రాక, జాకెట్లు ఎల్లా కుదించాలో తెలియక తికమక పడడంతో ఇద్దరికి నవ్వూ వచ్చేసింది. అమాయకత్వం నిండిపోయినట్లు చూస్తూ యాజులు శ్రుతి కలిపేసేడు. కెంపులే కదిలేయి.

కాఫీ త్రాగి సావిట్లోకి వచ్చేసరికి, శ్రీపతి ఎదురుగా వచ్చేడు. వీడు ఇంత పెందరాళే ఎందుకు వచ్చేడా అన్న సంశయం పీకింది. అందులోనూ ఒట్టిగా ఎప్పుటూ రాడు. వస్తే లంకాదహనమే చేసి వెళ్లుతాడు అన్న అనుభవం వుండడంవల్ల తీరా వీడు ఇప్పుడు 'భాభీ' ఎవ్వరా చూపించరా అంటే తను అస్త్రసన్యాసం చెయ్యాలి.

"హర్రోఁచ్! ఏం ఇల్లా వచ్చింది బండి?"

"ఏముంటుంది? వనం ఐ. సి. యస్. పరీక్షకు కట్టాలని ఆజ్ఞ వచ్చింది. అందుకు బజారున పడ్డానురా వాత, పిత్త, శ్లేష్మప్రవృత్తుల ననుసరించి ప్రిపరేషన్నుకు."

నవ్వేడు యాజులు.

శ్యామల కప్పుతో కాఫీ పట్టుకుని సావిట్లోకి వచ్చింది. ఒళ్ళంతా కృతజ్ఞతో యాజులు దాసోహం అనేసేడు పరువు నిలబెట్టినందుకు.

వచ్చినవాడు పల్గుణుండు అన్నట్లు శ్రీపతి "ఏమండీ? మిమ్మల్ని ఎక్కడో చూచినట్లు వుంది?" అన్నాడు.

ఒసారి ఎగాదిగా చూస్తూనే, ఈ హైరోడ్డు ట్రాపింగు ధోరణి చూచి "ఇప్పుడు ఎదురుగా చూస్తుంటే ఎక్కడో చూచేను అంటారేమిటి? చత్వారం అయితే కళ్ళజోడు పెట్టుకోకూడదూ?" శ్యామల చురుక్కుమనిపించింది.

ఉల్టాసీదా అయినట్లయ్యింది శ్రీపతికి. "అది కాదండి."

"ఏమీ ఁండీ కానీది. యాగానీది. ఏదో మర్యాదగా వచ్చి, ఆయనతో మాట్లాడిపోక, మధ్యలో ఈ పిచ్చిపుల్లాయి ప్రశ్నలు వేస్తేనే కాని నోరు వూరుకోదా? లేకపోతే అది మీమీ పెద్దమనిషి తత్వాల్లో అలవాటైన నల్లమందా?"

హుషారు ఎక్కింది యాజుల్కు, భలే వుజ్జీ ఈ శ్రీపతికని.

ఓటమి అంగీకరించే పరిస్థితివచ్చింది శ్రీపతికి. అది కప్పిపుచ్చుకుంటూనే, ఎక్కడ దొరికింది ఈ బర్రెంక డొంక అనుకుంటూనే, ఓసారి యాజులువైపు సానుభూతిచూపులు పారేస్తూ" అసలు నిన్న మా వాళ్లు రానందుకు కారణం చెప్పుదామని వచ్చేను, మళ్ళీ కలుస్తా" అంటూనే గుమ్మం దాటేడు.

"ఎవరండీ! ఈయన?"

"పి. డబ్ల్యు. డి. గుమాస్తా."

"స్నేహితుడా?"

"అవును."

"భలేవాళ్ళున్నారే స్నేహితులు మీకు."

"ఆ. స్వతహాగా మంచివాడే. కాని..."

"ఏముంది?"

"విన్నారుగా. వాళ్ళవాళ్ళు..." ఇక చెప్పడానికి నోరు ఆడలేదు.

"మమ్మల్ని పరిచయం చేసుకుందామని, చూడాలని వుంటే,రమ్మన్నారు కాబోలు మీరు. అంతేనా?"

ఏదో రగడలోకి దిగింది మళ్ళీ అనుకుంటూ ఆవిడ వచ్చింది.

"ఈయనకు మనకూ ఏంచుట్టరికాలూ లేవు. పాతస్నేహితులమూ కాము. తగుదునమ్మా అని వూళ్ళో వున్న స్నేహితులిండ్లకు వెళ్ళి, వాళ్ళందర్నీ మనల్ని చూడ్డానికి రమ్మని పిల్వడానికి హక్కు ఎక్కడనుండి వచ్చిందంట? ఏమండీ మాట్లాడరేం?"

"ఏమండీ! అల్లా ఎవరితో నేనా చెప్పేరా?" సజావుగా ఆవిడ.

"చెప్పడం ఏమిటి ఆయనెవరో వచ్చి, నిన్న నీ ఆహ్వానం మన్నించి మా వాళ్ళు రాలేనందుకు కారణం చెప్పడానికి తెల్లారకుండా నే వస్తే..."

"అల్లా పిల్వడం తప్పు కాదండీ? వచ్చినవాళ్ళు ఏవో కొంటె ప్రశ్నలు వెయ్యడం. మీ ముఖం చూచి మేం అబద్ధాలు చెప్పడం ఎందుకూ? రేపు ఇవన్నీ కూడా మీ మెడకే చుట్టుకుంటాయి"

"అప్పుడే వచ్చి వారం దరిదాపు అవుతోంది. అల్లా మార్కులు వేయించుకుందామని వచ్చి ఇల్లా చుట్టాల్లా, సామెత చెప్పినట్లు, ఇక్కడ వుండిపోవడం మాకు ఎంతో చిన్నతనంగా వుంది. ఎన్నాళ్ళు వుంటాం? వుండినా ఏం బావుటుంది. ఈ ఘుణాక్షర న్యాయంగా కలసినవాళ్ళం! దయయుంచి మీరు శ్రమ అనుకోక, ఆపని కాస్తా చేసిపెడితే మీకు కృతజ్ఞులం. మీ పేరు మరిచిపోము."

"అదికాదు. మనల్ని ఎల్లాగా చేతిక్రిందవున్న వాళ్ళే అనుకోని, ఆలెక్చరరుగారు హైదరాబాదు నుండి రాలేదు—అని కోడా చెప్పడం నాకు కాస్త అనుమానంగానే వుంది."

"ఊరుకోవే నువ్వు."

"ఆ! ఇల్లా వూరుకుంటే ఉరేసుకోవలసివస్తుంది మనం. ఆపని చేస్తాను అని అటో ఇటో తేల్చక ఇల్లా నాన్చడంలో అర్థమేమిటి? పోనీ ఆ పని లేకనుకుంటే ఆ పోలీసుల రిపోర్టు, ఇంటావిడ క్రాస్ ఎగ్జామినేషన్, స్నేహితుల భార్యలకు పిలుపు, ఆ ఎవత్తో దానితో సెకెండు ఫ్రంటు, ఈ అకాలపు వర్షాల్లో, ఎక్కడా చిన్న చిత్తు కాగితం దొరకని ఇంట్లోకి ఉన్న పత్రికలన్నీ రావడం, ఎవరెవరికో ఎక్స్‌ప్రెస్ డెలివరీ ఉత్తరాలు, వీట్ల అర్థం ఏమిటి? ఏదో పెద్ద ఎత్తుమీదనే వున్నాడు. ఏదో వయస్సులో వున్న వాళ్లు వచ్చేరు, మన చేతుల్లో పడ్డారు, ఇంకేముంది అనుకుంటున్నారేమో ఆయన."

'ఛా! అల్లా అనుకోవడం తప్పే. ఆయన అల్లాంటి వారు కారు."

"వారు, వీరు నాకేం అర్థం కావటం లేదు. ఏమైనా సరే! యాజులుగారూ, పిచ్చికళలు మాత్రం ప్రదర్శించేరంటే పప్పులుడకవు. మర్చిపోకండి. జాగ్రత్త" అంటూ అనేసి లోపలికి వెళ్ళిపోయింది.

సత్యం ఒప్పుకోవాలంటే శ్యామల చెప్పిన, ఏకరువుపెట్టిన విషయాలు నిజమే. అవన్నీ తను స్వయంగా, పరకీయంగా చేసినవే. జవాబు చెప్పి అవన్నీ పచ్చి అబద్ధాలు అని బుకాయించడానికి ధైర్యం లేదు. స్తబ్ధతలోనే వుండిపోయేడు.

"అవ్వాళ ఇచ్చిన ఉత్తరాలు పోస్టు చేసేరా?"

"అప్పుడే."

"ఒక్కదానికీ జవాబు రాలేదు. అదేమిటో అలా వుంది."

దొరికింది అనుకుంటూ "మీరు శ్యామల చెప్పినవన్నీ వూకొట్టేరు. ఒక్కటి అడుగుతా! ఆనాడు నా దగ్గరనుండి వివరాలు రాబట్టి మా మామగారికి ఉత్తరం వ్రాయడంలో అర్థమేమిటి?" యాజులు ఎదుటి ప్రశ్న.

గతుక్కుమంది మొదట్లో "అదా! ఆయన మీ మామగారా?" ఎంతో తెలియనట్లు అడిగింది.

తెల్లబోతూ "ఆ! మీకు తెలియదా?" అన్నాడు.

"లేదే! అయితే ఈ సారి తప్పకుండా వాళ్ళింటికి వెళ్ళి మీ పట్టమహిషిని చూచివస్తా లెండి."

కట్టుకున్న ఆశలన్నీ కుప్పకూలిపోయేయి. ఏడుపు వచ్చింది. రుద్ధకంఠంతోనే,

"ఎందుకంత శ్రమ. ఇప్పుడు మీరు అగ్నిహోత్రావధానులు అవనక్కర్లేదు. ఆ శ్రమకూడా ఎందుకు?" అనేసేడు ఈసడింపుతో.

నవ్వేస్తే ఏమనుకుంటాడో అన్న గౌరవంతో లోపల్కి వచ్చేసింది. కోపంలో వుండి శ్యామల వంకాయల్ని చిత్రవధ చేసేస్తుంటే, జబ్బ పట్టుకుని, కళ్లల్లోకి చూచి, ఓసారి ఊపుతూ నవ్వేసింది ఆవిడ.

కలధం అయి యాజులు లెక్చరర్ ఇంటికి బయల్దేరేడు. ఆయన్ని పట్టుకుని, పేపర్లు చూచి, చెయ్యతగ్గ సహాయం చేసి, విజయం వచ్చిందన్న భావనలో అడుగులు వేస్తూనే వచ్చేడు. ఆదివారం కదా! తొందరేముంది, ఇంటికి వెళితే ఏ పేచీల్లోకి ఏవిధంగా దిగుతుందో అన్న పీకుతో. ఏ శ్రీపతి ఇంటికేనా వెళదామనుకున్నాడు. ఉదయం జరిగిన సంఘటన వెనక్కు తీసింది. రామారావు ఇంటికి వెళ్ళడం ఇష్టం లేదు. పైగా ఆ యింటివరస చూస్తే, మునిసిపాలిటీ చెత్తబండి చాలా శుభ్రంగా వుంటుందన్న భావన. వెళ్ళినా కూర్చోలేడు.

బజారున పడ్డాడు. అప్పుడే పట్నంనుండి వచ్చిన బుట్టలు విప్పుతూ, చామంతిపూలు, గులాబీపువ్వులు నీళ్ళలో వేసి దుకాణంలో సద్దుతున్నాడు సాయిబు. ఆవిడ, శ్యామలా ఎవరైనా, తనమీద ఏ భావమున్నా, వాళ్ళకు కొనితీసుకువెళ్ళడంలో ఏం తప్పుంది. అంతగా అడిగితే పరీక్షలో ప్యాస్ అయినందుకు అన్న సమాధానం చెప్పెయ్యవచ్చు. అనుకుంటూనే కొన్నాడు. అందులోనూ ఎక్కువగానే.

ఇంటి మొగం పడుతున్నప్పుడే "యాజులూ నీజాతకంలో ఏదో పెద్ద నీచభంగరాజయోగం వుండితీరాలి.

ఎప్పుడూ నువ్వు అనుకునేది ఒకటి; జరిగేది మరొకటి. ఒక్కటికూడా నీకు సంతోషంగా సరిగ్గా, క్రమంగా జరగవు. అదే నీ కర్మ!" అని ఆత్మ ఎత్తిపొడిస్తే నిలువునా నీరైపోయేడు. కళ్లు చెమర్చాయి. సింహావలోకనం అదే నిజమనిపిస్తే, చేతిలో పువ్వులు ముళ్ళ కంపలా తట్టాయి.

దిగులుతోనే అడుగులు వేసేడు. నడతీరుగు అయినట్లు మెట్లు ఎక్కేడు. సావిట్లో కుర్చీలో తన మామగారు ప్రక్కగా బొద్దుమీసాల్తో మరో పెద్ద మనిషి కూర్చునే వున్నారు. వాళ్ళను చూచేసరికి పై ప్రాణాలు పైనే పోయాయి.

క్రమ్ముకున్నట్లుగా, అణగిపోయిన ద్వేషం, కోపం విజృంభిస్తే "ఎందుకు వచ్చేరు?" అని నిలదీసి అడిగినట్లే అడిగేడు మామగార్ని.

"మీకు తెలియదా? అందుకే" అన్నాడు పెద్ద మనిషి.

"అందరికీ తెలుసు. ఆనాడు ఏనాటితో తుది నిర్ణయం అయిందో అప్పటినుండి మీకూ మాకూ సంబంధం లేదు. మీరు అడపా తడపా ఇల్లా మాగుమ్మం ఎక్కనక్కర్లేదు."

"అల్లా అంటే ఎల్లా చెప్పండి యాజులుగారూ! కన్నకడుపైరి, పైగా అది మాకళ్ళఎదుటే మనోవ్యథతో క్రుంగిపోతూవుంటే కడుపు చెరువై పోతోంది. దాని దుఃఖం చూడలేకుండా వున్నాం. కత్తికోతే మాకు.

"ఇవి చేతులుకావు కాళ్ళనుకోండి. పెద్దవాణ్ణి. ప్రాధేయపడుతున్నా. బావగారు అన్నట్లుగా ఆ రెండెకరాల పొలం ఇప్పుడే మీ పేర కట్నం బాకీ క్రింద వ్రాసి ఇస్తాము. వారికి క్షమార్పణలు చెప్పుకుంటాను. మీరు ఏంచెయ్యమంటే అది చెయ్యడానికి సిద్ధం. దాని సంసారం సరిదిద్దితే చాలు. నాకు ఏమీ కోర్కెలు లేవు." కళ్లు నీళ్లు కారుతుంటేనే చేతులు పట్టుకున్నాడు మామగారు.

"గతం మర్చిపోవాలి మీరు. తప్పు జరగడం సహజం అయినా, మీరు విజ్ఞానవంతులు లోకజ్ఞానం తెలిసివున్నవారు ఆ ముసలాయన మనస్సు కొంత సంతోషపెట్టవలసిన బాధ్యత మీ మీద వుంది." మధ్యలో పెద్దమనిషి.

"మా నాన్నగారు మొన్ననే మనోవర్తి దస్తావేజు వ్రాయించి సంతకం తీసుకున్నారు. తెగతెంపు చేసుకున్న తర్వాత ఇక అతికడం కష్టం కూడాను."

"అల్లా అనకండి. మీరు తలచుకుంటే అవన్నీ చాలా స్వల్పవిషయాలు. అల్లా అనేస్తే అగ్నిసాక్షిగా ఉద్వాహం ఆడిన అమెకు పెద్ద అన్యాయం చేసినట్లే అవుతుంది, అమె తప్పు ఈషణ్మాత్రం ఏమీ లేకపోయినా." అన్నాడు పెద్దమనిషి.

"అల్లా అనడం నన్ను నిలువునా చీల్చినట్లే యాజులుగారూ! మళ్ళా అడుగుతున్నా, ప్రార్థిస్తున్నా, క్షమించండి గతంను." బెంబేలు పడిపోయాడు.

"నా చేతుల్లో ఏమీ లేనేలేదు. మీరు ఏమైనా మాట్లాడదలచుకుంటే మా నాన్నగారితో సంప్రదించండి...ఇక మీరు వెళ్లవచ్చు."

యాజులు చచ్చేంతభయంలో ఈ పీడల్ని ఎలా వదుల్చుకోవాలా అన్న భావంలోనే ఆఖరుమాట చెప్పేడు; పైగా లోపలవాళ్ళిద్దరూ కూడా ఈ సంభాషణలు వినకుండా వుంటేనే మంచిది అన్న అభిప్రాయంతో. ఒకవేళ మధ్యలో వాళ్లువచ్చి కలగచేసుకుంటే, తను గంగిగద్దు అయిపోయి తలాడించవలసి వస్తుంది. మాట్లాడనే లేకపోతాడు. నోరు మూగపోతుంది కూడాను.

"దస్తావేజు కూడా వ్రాయించి తెచ్చేం. మీరు కనికరించాలి. నేనూ కొంత వయస్సు మళ్లినవాణ్ణి. ప్రాధేయపడుతున్నా ఇవ్వాళే మీరు 'ఊ' అంటే రిజస్టరీ చేయిస్తాం." పెద్దమనిషి.

"మీకు చెప్పవల్సింది చెప్పేను. ఇక వట్టి వాగ్వివాదాల్తో ప్రయోజనము లేదు. వెళ్ళండి. నా నిర్ణయం కూడా అదే." కొంత చురుగ్గా అన్నాడు యాజులు.

అంతవరకూ లోపలి గుమ్మంఅవతల, ఆవిడ, శ్యాముల పొంచివింటున్నారని యాజులుకు తెలియదు. ఒక్కసారి ఇద్దరు తొంగిచూచేసరికి తెల్లబోయేడు. వాళ్ళిద్దరు ఈ వయస్సులోవున్న పిల్లల్ని చూచేసరికి డిల్లపోయేడు.

పెద్దమనిషి గొంతుక సవరించుకుంటూనే "రండీ సుందరం గారూ! ఇంత మూర్ఖపు పట్టుదల మనిషుల్ని చూడ్డం ఇదే మొదటిసారి నా జీవితంలో. అయితే అబ్బాయిగారి కృష్ణలీలలు కన్పిస్తూనేవున్నాయి కా. ఇంకా ప్రాధేయపడ్డం మన మూర్ఖ్యం అవుతుంది." అంటూ కొంత చురుకు పాల్లోనే లేచేడు.

"అల్లా అనెయ్యడం భావ్యంకాదు. స్వయంగా నేను వచ్చేను. కాళ్ళు పట్టుకుని అడుగుతున్నా. కనికరించండి." మరీ ప్రాధేయపడ్డాడు మామగారు.

మాట్లాడలేదు యాజులు. గుండెల్లో గుర్రాలు పరుగెత్తుతున్నాయి, లోపల వీళ్ళిద్దరూ ఏంచేస్తారోఅని. పైగా ఝువ్వున తగిలింది ఆ పెద్దమనిషి ఈసడింపు. చేసేదికన్పించలేదు, నిప్పున్న కర్రలానుసి అవశంతప్పు.

"మీ మమకారం అంతే. ఈయన ప్రభుత్వ ఉద్యోగి కదా! వాళ్ళ వాళ్ళు అన్నట్లుగా ద్వితీయ వివాహం ఎట్లా చేసుకుంటాడో చూస్తాను! అటు ఉద్యోగానికి తిలోదకాలు ఇచ్చుకోవడం, ఇటు శ్రీకృష్ణజన్మస్థానం అలంకరించడం చేయించకపోతే నా పేరు..." తడబడ్డాడు పెద్దమనిషి.

ఎర్రగా కాల్చి వాత పెట్టినట్లయ్యింది. ఏమైనా అంటే, ఎదరతిరగబడి ఆ యింట్లో వున్న వాళ్ళకూ నీకూ ఏం సంబంధం అని వీధిని పెట్టేస్తాడేమో అన్న భయంలో కుంగిపోయేడు.

"అల్లాగే చెయ్యండి. ఇక బయటకు దయ యుంచి వెళ్లుతారా?" లేచేడు.

ఆయనా తన సంచీ పట్టుకునీ, శోకమూర్తి అయితే, వెనకాల పెద్దమనిషి కళ్ళెర్రతో బయట పడ్డారు.

'ఉస్సు' రంటూ నే కుర్చీలో కూలపడ్డాడు. ఆలోచనల మీద అంతస్థులు ఒకటి తర్వాత ఒకటి క్రమ్ముకున్నాయి, భోజనానికి పిలుపు వచ్చేవరకూ.

ఎవ్వరూ మాట్లాడనే లేదు. ఏదో మరయంత్రాల్లా పనులు జరిగిపోతుంటే ఉండబట్టలేక నే "మీరు ప్యాసు అయ్యేరు." అన్నాడు ఆవిడవైపు తిరుగుతూ.

"మీ సహాయానికి కృతజ్ఞురాలిని." అంది ఆవిడ అతి ముక్తసరిగా.

"అయితే మనం రాత్రిబండికి వెళ్లి పోదాం."

యాజుల్కు ఏమీ తోచలేదు. ఎత్తిన చేతిలో పచ్చడీ అన్నం దింపేసి, దిగులుపడిపోయాడు.

"అల్లాగే!" అంది ఆవిడ సమాధానంగా.

"ఒక్క నా ప్రార్థన వుంది. ఏదో ఈ వారం నుండీ నా యిల్లు పావనం చేశారు. జీవితాంతం మరుపు రాని క్రొత్త అనుభూతి కల్గచేశారు. మీ పనీ అయ్యింది. కనుక ఇంకో రెండురోజులు వుండి వెళ్ళండి అని కోరుతున్నా." ప్రాధేయత బాగా చూపించేడు.

ఆవిడ పులకిత అయింది.

శ్యామల కొత్త చిరాగ్గానే "అంత అల్లావుంటే, మీ ఇంటావిడని తెచ్చుకోకూడదు టండీ! ప్రొద్దుట ఆ ముసలాయిన్ని చూస్తే కడుపు దేవింది నాకు. దస్తావేజు కూడా వ్రాసి తెచ్చేరుకొ మీ తృప్తికోరకూ." అంటించింది.

"అవును యాజులుగారు! ఏదో పెద్దలపట్టుదలల్లో ఆవిడని అల్లా వరకశాఖపెట్టడం మంచిదికాదు. ఇంతకీ ఆవిడచేసిన తప్పు ఏమీ కన్పించటం లేనేలేదు. అల్లాంటప్పుడు..."

ఏమీ సమాధానం చెప్పలేదు. గబగబా పెరుగు పోసుకొని లేచిపోయాడు.

* * * *

వాళ్ళు తన కోర్కె మన్నించి ఉన్నందుకు సంబరపడ్డాడు యాజులు. ఈ రెండు రోజులూ ఆఫీసుకు శెలవు పెట్టేసేడు. ఏ ఏ చరిత్ర చిత్రాలు చూపిస్తే బావుంటుంది అనే మీమాంసలో రామప్పవెళితే మంచిదని, స్నేహితుడిద్వారా ఓ పెద్దమనిషి కారు పుచ్చుకున్నాడు. అక్కడ రామప్ప చెరువుగట్టుమీద కూర్చుని పిక్నిక్కు సరిపోయే తినుబండారాలు, మిఠాయిలు, పళ్ళు అన్నీ కొనే యింటికివచ్చి సుప్రభాతముని చెపుతూ "త్వరగా బట్టలు వేసుకోండి" అని ఆదేశించాడు.

వంటప్రయత్నాలకు దిగుదామన్న సంసిద్ధతలో వున్న వాళ్ళిద్దరూ మొదట్లో తెల్లబోయినా, అనుకోనంతటి తొందర్లో తెమిలిపోయేరు. కారులో వున్న బండెడు సామాను చూచి ముసిముసిగా నవ్వుకున్నారు.

"అప్పుడు కాలేజీలో..." అంటూ మొదలు పెట్టి ఒక్కొక్కళ్ళే అనుభవాలు, మధ్యమధ్యలో కస్తులు కోసరుగా వేళాకోళాలుతో రామప్పగుడి చేరేరు. పాలంపేట బంగాళాలో సామానుదించుకొన్నారు.

ఈ కాకతీయశిల్పం, ఆ ప్రకృతి సృష్టి, హైగర్ స్లూయిస్, ఆలయం మీద చెక్కిన శాస్త్రచిత్రాలు, అన్నీ వాళ్ళిద్దరు విస్తుపోయి చూస్తూంటే; యాజుల్కు ఎంతో సంతోషమైంది. బూజంపంక్తిలాగే భోజనాలు చేసేరు. కాళ్ళు అరిగేటట్లు తిరిగేరు. ప్రశాంతయామిని; పచ్చటిచేలు ఓ పక్క, లోతు తెలియని అఖాతాలు రెండో పక్క, చుట్టూరా అడవులు, అడవుల్లో మృగాలు, ఇవన్నీ కూడా ఎక్కువగా ఏకం కల్పిస్తే, ఉద్రేకం చెందేడు. ఏవోఏవో ఎక్కువగానే మాట్లాడేడు; ఉత్సాహం ఆపుకోలేక నే.

"ఏం మరదలూ! ఎల్లావుంది మా దేశం?" అన్నాడు శ్యామలవైపు తిరుగుతూ గర్వంతో.

అన్నివైపులనుండి ఒక్కమారు గాలి వచ్చి ఉక్కిరిబిక్కిరి అయినట్లయ్యింది శ్యామల ఈ చుట్టరికానికి; ఆతని పిలుపుకూ. తేరుకుంటూనే, పాడుపడ్డ గుడిశిఖర్ల నుండి అడవుల అంచుల్లోకి చూస్తూన్న ఆవిడవైపు చూచి, "అయితే యాజులుగారికి శృంగారం వస్తోందన్నమాట." కసిరినట్లు అని "ఏమండోయి, మిమ్మల్నే పిలుస్తున్నాడు ఆయన. నేను పనికి రానుట" అంటూ కిలకిలమంది.

అతను అన్నమాట విని, మైకంలో సరస్వతీ ఝరిని చూచినట్లయి, కదలిపోయిన ఆవిడ, చుళుక్కని ఓసారి యాజులు కళ్లల్లోకి చూచింది. ఆయన చూపు నిలుపుకోలేకపోతే గుబగుబమని, ప్రస్తుతంలోకి వచ్చేసింది ఆవిడ

"అయితే నన్ను పెళ్లాడి ఈ ములుగు అడవుల్లో వదిలేస్తారేమో!" అని వేళాకోళం చేసింది.

"విన్నారుకా! అసలు ఆవిడను చేసుకోడానికి భావగారూ మీకూ తాహతు వుందండీ? ఏ ఐ. ఏ. యస్. వో అయి, గుమ్మందగ్గర నుంచుని, వంగి వంగి సలాములు చేస్తే, అల్లాంటివాళ్ళను కనీసం కన్నుగోటు నుండి చూడ్డానికైనా వప్పుకుంటుందో లేదో ఆవిడ మరి?" శ్యామల వ్యాఖ్యానం.

'వచ్చేమురా భగవంతుడా! ఎందుకు నోరుజారింది! ముళ్లకంపలో పడిపోయేను' అని తల వంచేసుకున్నాడు. ఎత్తి కుదేసినట్లయ్యింది పుట్టెడు ఆనందమున్నూ.

"పోనీలెండి. అంత అంతస్తులో లేను నేను. మిమ్మల్ని పెళ్లాడ్డానికి అభ్యంతరమూ లేదు నాకు. మీరా పర్వాలేదు! ఉద్యోగమూ మోతాదుగానే వుంది. ఆవిడ అన్నట్లు అడవుల్లో వదిలేసినా, రాత్రికి తిరిగి ఇంటికి వచ్చేస్తాను. ఆ భయం లేదు. పోనీ నన్ను ఏరుకోకూడదూ?" అతిప్రాధేయపడ్డట్లు. మోహం ఎక్కువైనట్లూ త్రిప్పుకుంటూ, స్వరం మలుపుతూ, దగ్గరావచ్చి సరసనే కూర్చుంది; భుజంమీద చెయ్యి వేసింది.

గాబరాపడి మొఖంమీద నీళ్లుచల్లాల్సినంత పరిస్థితి వచ్చింది యాజులుకు. దీనికి తోడు ఆవిడ విరగబడి నవ్వడం పుండుకు కారం జల్లినట్లుంది. పైగా శ్యామల ఇంకా జరుగుతూ "బావగారూ! ఇటు చూడండీ" అని సుతారంగా గడ్డం తనవైపు త్రిప్పుకుంది.

"నేను బాగోలేనా? మా నాన్న చేత మీకు ఇరవై వేలరొఖ్ఖం ఇప్పిస్తా. అక్కర్లేదంటే భూమి వ్రాయిస్తా. మాట్లాడరేం?"

ఇక లాభం లేదనుకున్నాడు. వళ్లంతా అప్పటికే ముచ్చెమటలు పోసేయి. లేచి రెండడుగులు వేసేడు. ఈ బ్రహ్మరాక్షసుల కన్న ఆలిల్లీ ఎంతో మంచిది అనుకున్నాడు. ఎంత త్వరగా ఇంటికి చేరి, వీళ్లను రెలు ఎక్కిస్తే అంత మంచిది అన్న తొందరా కల్గింది. కారు వైపు ఓసారి చూపులు సంజ్ఞాభావంగా త్రిప్పినా ఆవిడ చూడనట్లు. ఈడ ఇంకా మనకథ మంగళహారతిపాడే వరకు రానట్లూ వుండడంతో ఉస్సురనిపోయేడు.

"పోనీ ఆలిల్లీకంటె బాగోలేనా?" అంది శ్యామల.

ఓరి అరిష్ట జాతకుడా! అన్నట్లయ్యింది ఆ ప్రశ్న.

"సమాధానం చెప్పకపోతే పోయిరి. అది నెలకు ఏభై రూపాయిలు తీసుకుంటుంటే నాకు ముప్పై ఇస్తే చాలు. దానితోనే తృప్తిపడుతా. అఖరుకు తాళికట్టకపోయినా సరే!"

పట్టపగ్గాలులేకుండా వచ్చే నవ్వు ఆవిడకు ఆగలేదు. కళ్ళమ్మట నీళ్ళు తిరిగేయి. ఎంత పమిట కొంగులో ఈ శ్యామల వేళాకోళంలో శాస్తి చేస్తోంది. వాతలు పెడుతోందన్న గుంభనవున్నా, ఆయనంతగా క్రుంగిపోవడం ఆర్ద్రపరిచింది. ఏర్పడ్డ భావన, చేసిన ఉపకారం 'కృతజ్ఞత' అని అంటుంటె ఊగిపోయింది.

"చాల్లే శ్యామూ!"

"ఊరుకో అక్కయ్యా! ఈ గురివిందగింజ బావగారు, మహామన్మధుడనుకుని, పట్టుమని పది రోజులనుండేనా ఎరగని నిన్ను ప్రేమించేస్తాడుట. పెళ్ళి చేసేసుకుంటాడుట. మరదలూ అని పిల్వడానికైనా మానవత్వపు హక్కు లేని ఈయన్ని అసలు ఆవిడే వదిలేసిందేమో!" అనీ అనేసింది.

అంగులోని అర్థాలు అతిగా వెళ్ళేయి. గుండెలు తూట్లు తూట్లు పడిపోయేయి. పైగా వాళ్ళు ఇద్దరూ అక్కా చెల్లెళ్ళయ్యి కూడా కానట్లు నటించడం, తనకి తెలియకుండా ఆలిల్లీని మూడు చెరువుల నీళ్ళు త్రాగించి, పొలిమేరల్లో కాలెట్టనియ్యకుండా చేసి వుంటారన్న నిరుకూ, ఇంకా వుంటే కొంపనిప్పెపెట్టేస్తారన్న భయం, పిరికితనం, ఆవేదనల్లోపడి, అగమ్యగోచరతలోకి దిగిపోయేడు యాజులు. ఇదంతా చూస్తే మోదుగపువ్వు తెచ్చి భార్యకు ఇచ్చిన బ్రాహ్మణుడు అయినట్లే తట్టింది; తన వరుస.

"ఇంక వెళ్దామా?" అంది ఆవిడ లేస్తూనే.

"జీహుజూర్" అనేసేడు యాజులు ఒక్క మార్గం కల్గిస్తే తప్పుకోడానికి కృతజ్ఞత చూపిస్తూ.

కారు కదలనూ కదిలింది. ఈసారి యాజుల్ని కోరి ఆవిడ దగ్గరగా కూర్చోపెట్టుకుంది. ఎగుడు దిగుడులో ఊగుతూ జబ్బలు తగిలించింది.

ఈ స్వతంత్రహిందూదేశానికి ప్రెసిడెంటు పదవి వస్తే ఇల్లాంటివాళ్ళను ఉప్పుపాతర వేయిస్తే... అని మనస్సులో అనుకున్నాడు.

మల్లంపల్లి దాటేసరికి, ఆవిడ చెయ్యి తన మీదనే నిల్చిపోయింది. జారిపోతువాగు దాటేటప్పుడు భయంతో అన్నట్లు గడ్డం భుజంమీద ఆన్చింది. ఆత్మకూరు వెనక్కు వెళ్ళేసరికి పూర్తిగా ఆనుకుని కళ్ళే మూసుకుంది నిద్రలో.

అర్థంకాలేదు. జరిగిన సంఘటనలు గుండెల్ని ఇంకా స్వస్థానంలోకి చేర్చనే లేదు. ఆవుదుట తగ్గనే లేదు. అప్పుడే ఇకేమిటరా నాయనా! అని చీమలూ జెర్రెలూ పాకినట్లయ్యేడు. ఉక్కిరిబిక్కిరే అయ్యింది.

గుమ్మం దగ్గర ఆగేసరికి, ఏవి ఎట్లా పరిణమించినా, ఆవిడకు తనంటే ప్రేమ అని, అది వ్యక్తీకరించటం లేదని, ఇప్పుడు చూపించినవన్నీ నాందీప్రస్తావనలన్న తలంపు వదలుకోలేక పోయేడు. పునుగు అత్తరువు రాసుకున్నట్టే అయ్యింది.

ఇంకా సామాను దింప నేలేదు "అయ్యా! మిమ్మల్ని ఎప్పుడు ఇంటికి వస్తే అప్పుడు వెంటనే పెద్దదొరవారు దగ్గరుండి పట్టుకురమ్మన్నారు. సందకాలనుండి కూర్చున్నా."

వాళ్లిద్దరూ తెల్లబోయేరు ఏం ఉప్పెనమీద పడ్డానికి సిద్ధంగా వుందో అని.

"ఏమిటి! విశేషం?"

"ఏముంది. మధ్యాహ్నం నుంచి నిప్పులు కురిపించేస్తున్నాడు. చింతామణిగారిని మోత్తిల్ చేసేడు. హెడ్‌గుమాస్తాను మీకు శెలవు ఎందుకు మంజూరు చేసేరని తిట్టేడు."

లోపల భయంవున్నా పైకి వాళ్లేమనుకుంటారో అని "ఏం అమ్మగారు ఇంకా రాలేదా?"

నవ్వేడు వాడు "వస్తుం దనుకున్నాం కాని నే వచ్చేవరకూ రాలేదు సార్."

కారు డ్రైవర్ని పిల్చి కొత్త నన్ను ఆ బంగ్లా వరకూ దింపి నువ్వు వెళ్లవచ్చు అన్న ఆదేశాల్లో ఎక్కి కూర్చున్నాడు.

గజిబిజిగా తడితే, అగ్గిపెట్టె వెతుక్కుంటూ, లాంతర్లు ముట్టించేరు. ఎదురుగా రెండు వుత్తరాలుపడి వున్నాయి. తనుకే అన్న కంగారులో ఎడ్రెస్‌లు చదివిల, ఆయనకే వుండడం నిరుత్సాహపరచింది.

"అక్కయ్యా! ఈ కవరు నరసారావుపేటనుండి; ఇది బెజవాడనుండి అనేసింది శ్యామల.

"ఏమిటీ, ఏవీ ఇలా ఇయ్యి." అంటూ పుచ్చుకుని, నిరుకూ చేసుకుని, ఫ్రరున చింపేసింది. మడతలు విప్పి చదవడం ప్రారంభించింది.

"వెంకట్రామయ్యగారి కూతుళ్లుఇద్దరూ ప్రస్తుతం ఇక్కడలేరు. మద్రాస్ వెళ్లేరని వార్త. ఈ మధ్యనే ముసలాయన, వార్ధక్యం వచ్చేస్తోందని, పెండ్లికొడుకుల వేట జోరుగానే చేస్తున్నాడు.

పెద్దమ్మాయిపేరు కస్తూరి. రెండో అమ్మాయి పేరు శ్యామల. ఇరువురిలోనూ పెద్దావిడ చాలా సౌమ్యురాలు. బుద్ధిమంతురాలు. ఇక రెండోది ఒట్టి చిలిపిరకం. చూడ్డానికి ఇద్దరూ బాగానే వుంటారు.

ఓవేళ నీవైపు ఎవరేనా మంచి సంబంధంవుంటే ఆయన గుమాస్తా మా ఇంటి ప్రక్కనే వున్నాడు. ఆయన ద్వారా కొత్త చెవిని పడేయిస్తాను..."

ఇక రెండోదాల్లో "కాలేజీలో చదువుకుంటున్నప్పుడు, కొత్తకాలుజారితే గుంటూరు మిషన్ ఆస్పత్రిలో ఏదో చేయించడం, వెనువెంటే అలక పాన్పుమీద ర్యాలీసైకిల్ ఇవ్వలేనందుకు కోపగించిన అల్లునకు ఘంటలో బి. యస్. ఏ. సైకిలు, హిండ్ రేడియోలు ఇచ్చి, ఆమెను కాపురానికి పంపడం జరిగింది.

నా వాకపుల్లో అప్పుడప్పుడు ఎవరో ఇద్దరమ్మాయిలు వీళ్ళింటికివచ్చి, పదేసిరోజులు వుండడం, జరుగుతూనే వుందిట. వాళ్ళిద్దరూ దూరాన్నుంచిచూస్తే కవలల్లా వుంటారు. ఒకామె పేరు కస్తూరిట. రెండో ఆమె పేరు తెలియనేలేదు.

వాళ్ళిద్దరికి ఇంకా పెళ్ళికాలేదని, మా మామగారు మాటలసందర్భంలో అన్నారు. నిరుగ్గా భలానా వారి అమ్మాయిలని చెప్పలేక పోయేరు.

ప్రయత్నంచేసి, వాళ్ళ పుట్టుపూర్వోత్తరాలు, అంతగా కావాలంటే వాకబుచేస్తాను."

మిల మిలా మెరసిపోయేయి నాల్గు కళ్ళున్నూ. పై సంబోధన, క్రింది సంతకాలు చూస్తే ఈ ముసుగులో గుద్దులాటకు నవ్వూ వచ్చింది. యాజులు పన్నాగమూ తేటతెల్లమైంది.

"వెన్నపూస నోట్లో నాననట్టు ఉన్న ఈయన మొత్తంమీద దేవాంతకుడే! ఏమిటో అనుకున్నా" అని ఆశ్చర్యం కనపరచింది శ్యామల.

"మనమీద పెద్ద సి. ఐ. డి. తవం చేస్తున్నారన్నమాట" అంటూ ఫ్రరుఫ్రరున చింపేసింది ఉత్తరాలు ఆవిడ.

మొదట్లో ఆపనికి తెల్లబోయినా "అక్కయ్యా! పేపర్లన్నీ కొంటున్నాడు. ఏ తప్పిపోయిన, పారిపోయిన ప్రకటనలకోసం కాబోలు!" అంటూనే గూట్లోవున్న కట్టలన్నీ తిరగవెయ్యడం, తాక్కున ఆగిపోతూ "ఇదిగో దొరికిపోయేడు. ఇది చదవ్వే అక్కయ్యా" అనీ పేపరు ముందుకు త్రోసింది.

ఆవిడ చదివింది. "అయితే ఇంకో స్వయంవరం వుందన్నమాట."

"అవ్వాళ దీనికే కాబోలు ఎక్స్ప్రెస్ డెలివరీ ఉత్తరం వ్రాసేడు." దగ్గర లేనుకాబట్టి ఎడ్రెస్ ఆనలేదు కాని కేరాఫ్ పోస్టుమాస్టరు అని వ్రాపినట్లుందే."

"సరే కానియ్యి. ఇంతవరకూ వచ్చినతర్వాత ఇప్పుడు వెనక్కు తిర్గడం ఎందుకూ! ఆపని ఏమిటో తెముల్చుకునే వెళ్లడమో, వుండడమో చేద్దాం."

హుషారులో అన్నా, శ్యామల పట్టుకుంది. "అక్కయ్యా! ఏమిటే ఆపని? ఉండడం, వెళ్లడం అంటున్నావేమిటే?" నిలదీసేసింది.

వాలిక్కరచుకున్నా ఆవిడకు ఏవిధంగా సమాధానం చెప్పాలో తెలియలేదు. మాట తప్పిద్దామనుకునే "శ్యామా! ఇంతవరకూ ఆయనకు నా పేరేమిటో చెప్పలేదే!"

బాగా తెల్లబోయింది. ఏదో నిగూఢం వుంది అక్కయ్యలో. అదే అర్థంకావటంలేదు. దాన్ని తెలుసుకుందామనుకున్నా, ఆ గాంభీర్యం, ముక్తసరి జవాబులు, ఏవిధంగానూ దోహదం చెయ్యకుండానే వున్నాయి. అడగలేకపోతోంది.

"నువ్వు జబ్బపట్టుకుని, చిన్నాయన ఇందుకూరి రాజుగారు వచ్చినపుడు వెనక్కులాగకపోతే, పెళ్ళి ఈడవడా ఆడవడా వాయించివుందును సుమీ!"

"ఆయనేనా!" బెంబేలుపడిపోయినట్లే ఆవిడ తడబడింది.

అవ్యక్త ప్రేమ పెల్లుబికితే ఒక్క ఉదుటలో వెళ్ళి, అక్కయ్య చేతుల్లో వాలిపోయింది; వ్యక్తావ్యక్తంలో ఏదో తెలియని ప్రసన్నత, ఆర్ద్రత ఆపుకోలేక కళ్ళమ్మట నీళ్లు పెట్టుకుంది శ్యామల.

ముఖం చేతుల్లోకి తీసుకుని కళ్ళమ్మట నీళ్లు తుడుస్తూ, అంతవరకూ పైకితియ్యని మాంగళ్యం తీసి చూపిస్తూ "ఆయనే నా పసుపుకుంకుమా?" అని బావురుమంది కస్తూరి.

ఇద్దరి కన్నీళ్లు కారి, వెలుగులో వెన్నెలై, ఇంద్రధనస్సుల్లా మారేయి. ఒకళ్ల కౌగిట్లో ఒకళ్లు కాలంలేకుండానే ఉండిపోయేరు.

* * *

గాలివాన వెలిసినతర్వాత వచ్చే ప్రశాంతిలా, యాజులు ఎన్ని లేవుడీలు చెయ్యబడ్డా, కౌగులో ఆవిడ తన సర్వస్వం నువ్వేఅన్నట్లు తనమీద గవద ఆనుస్తూ, కుదుపులకు కితకితలు పెట్టినట్లుగా యౌవనంలోని బిగి చేస్తుంటే, నోటితో అనలేని ప్రేమ, శరీరంతో అందిచ్చేసింది అన్నవిషయం, పీయూషపానంచేసినట్లే అయ్యింది. శరీరంలో కణకణం ఏదో క్రొత్త తేజస్సును బలం తెచ్చుకున్నట్టు, నరనరాలు మధురతలో గానం చేసినట్లు, పూర్తిగా తను గాలిలో ఎగిరిపోతున్నట్లుగాను అనుభూతి పొందేడు, యాజులు.

దాంతో, ఆ కౌగులో చిన్నగా తను చెయ్యి నడుంమీద వేసి ఒత్తుకోలేనందుకు, భయపడి తనవేపు మ్రొగ్గినపుడు కొంచెం గట్టిగా తనవైపు లాక్కోనందుకు, ఏదో చీకట్లో తన పెదిములు ఆవిడ బుగ్గమీదనుండి మెత్తత్రిప్పి వంకలో రాసుకోనందుకు, ఇప్పుడు చింతపడ్డాడు ఎంతగా వగర్చినా, మళ్ళీ అది పునఃఅవదు అన్న తలంపులో తల్లడిల్లిపోయేడు. తన్ని తానే తిట్టుకున్నాడు పిరికితనానికి. గత్యాగత్య తను ఆ శూరత్వం లేకపోయినా, ఈసారి తప్పకుండా ఆవిడే పాఠం చెప్పేస్తుంది అని కులికిపోయేడు.

ఈ జరిగిన విషయంతో ఆవిడ మనస్సులో పూర్తిగా నిండిపోతే, రెండురోజులు కాదు రెండు నెలలు వుంటారు వాళ్ళు తనదగ్గరఅని మురిసిపోయేడు.

ఇక రేపో, మాపో, నవోఢ సిగ్గు ఒలికిస్తూ చామంతిపూలు జడతో, అత్తరువు వాసనల్తో, తన దగ్గరగా వస్తూ, కళ్ళల్లోకి చూడలేని సిగ్గు చూపుల్తో బొటనవ్రేలు వ్రాస్తూవుంటే, అప్పుడు తను, తను... ...ఎల్లా తలంచుకోవాలో తికమక అయింది.

"అయ్యా! దిగండి" అనే వరకూ ప్రకృతిలో పడనేలేదు. వెంటనే పెద్దదొర, ఆయన ధుమారింపు, వైరికోపం వగైరాలన్నీ గాలి నింపుకుంటే, గుండెల స్పందనంతోనే దిగి లోపలికి వెళ్ళేడు.

వరండా. చికట్లు. గోడకు మాక్ లైటు. పైపు కాలుస్తూ దొర. ఆయన ప్రక్కగానే పంచి కట్టు, ఓ బనీను, పైన తువ్వాలుతో ఇంకో ఆయన. ఆయన్ను చూడ్డంతోనే 'ఈ దేశంవాడు కాడు' అనీ అనిపించింది.

"ఓ! యాజూలూ! కమాన్!" అన్నాడు దొర నవ్వుతూ. 'కూర్చో.'

ఏ కొండ విరిగి నెత్తిన పడుతుందో అన్న భయం కొంచెం సడలినా, భృత్యభావంలోనే నుంచుని పోయేడు వంగి.

"దిస్ కాల్ ఈజ్ నాట్ అఫీషియల్. కూర్చో. వారు నా స్నేహితులు. కాకినాడలో సబ్ జడ్జీ. పేరు సీతారామారావు గారు."

వినయంగానే నమస్కారం చేసేడు. చిరునవ్వు నవ్వుతూనే ఆయన స్వీకరించేడు; ఆఫీసరు హుందాలో.

"వారు రెండురోజులు సెలవుపెట్టి వచ్చేరు. నిన్ను చూద్దామని."

"నన్నా!" పూర్ణంగా తెల్లబోయేడు. కుసురుకునే; అయితే ఈయనకూ ఓ కూతురుంది కాబోలు, లేకపోతే అంత పెద్దమనిషి నన్ను చూడ్డం ఏమిటి? ఎక్కడ వున్న కాకినాడ? ఎక్కడ వుంది ఈ వూరూ అని అనుకున్నా, మీ నాన్నగారు వాళ్ళు ఆ దరిదాపుల్లోనే వున్నారులే అన్న వ్యాఖ్య చెలరేగింది.

తలవెంట్రుకలు కాస్త నెరసివుంటే, ఫించనీ పుచ్చుకునే కాలం దగ్గరలోనే వుంది కాబోలు. చవగ్గా వస్తాయని ఈ ములుగు తాలూకాలో భూము లేమైనా కొందా మనుకున్నాడేమో అన్న సందేహమూ వచ్చింది. అయినా ఊరుకోకుండా నిశితంగా నఖ శిఖ పర్యంతం తన్ని పరీక్షించడం, ఫర్వాలేదు అన్న నిబ్బరంలో తలూపుతూ దొరవైపు చూడ్డం చూస్తే, కంగారుపడ్డాడు. ఏ నాన్నగారికో చెబితే, ముందు పిల్లాడిని చూచుకోండి. నచ్చితే తక్కిన విషయాలు మాట్లాడుకుందాం అన్నట్లున్నది ఈ సింహావలోకనం అనుకుని, అవ్యక్తంగా ఓ సారి నిశాగ్గా నుంచుని ఫొటో తీయించుకునే దశలోకి వెళ్ళింది యాజులు శరీరం.

"మా ఆఫీసులో మంచి బుద్ధిమంతుడు గురుకైన వాడు ఈతడు ఒకడే." దొర ప్రవరచెప్పి, కుల ప్రతిష్ఠలు చెప్పగా, సిల్కుకోటు తొడుక్కున్నట్లయ్యింది.

"నీకు పెళ్ళయిందా?" ఆయన ప్రశ్న.

తికమక పెటినా, యాజులుకు అబద్ధం చెపితే నే కాని తప్పేమార్గం లేదన్న ఊపులో "నా కాళ్ళమీద నేను ఇంకా నుంచోలేక పోతున్నాను అప్పుడే..." అని నసికేసెడు. పైగా అందులోఉన్న ద్వంద్వార్థాలకు తనే మురిసిన్నీ పోయేడూ.

"మీ నాన్నగారిని ఎరుగుదును. మంచి పలుకుబడివున్నవారు ఆ తాలూకాలో." దొరతోనా, తనతోనా అన్నది అర్థంకాలేదు.

"నీ ఉత్తరం అందింది" చటుక్కున ఆయన అన్నాడు. తెల్లబోయేడు యాజులు. దొర, ఆయనా కూడా నవ్వుకున్నారు.

"అదనోయ్! పత్రికవాళ్ళు నాకు డైరెక్టు చేసేరు" రామాయణం అంతా వినక్కర్లేదు అనుకున్నా, యాజులు తన ఎగుడుదిగుడు ఊహాలకు మాత్రం సిగ్గు పడిపోయేడు.

"ఆ అమ్మాయి ఇంకా మీ ఇంట్లోనే వుందా?" తలూపేడు. "ఆవిడ స్నేహితురాలుట. ఇంకో ఆవిడ కూడా వచ్చింది."

"స్నేహితురాలా!" ఆయనకే అర్థంకావటం లేదు.

"అవును. ఆవిడ వచ్చిన రెండోరోజునే వచ్చింది."

"మరి వాళ్ళెవరో ఏమైనా వాకపు చేసేవా?"

"ప్రయత్నించే, కాని అంతుచిక్కటం లేదు."

"అల్లాంటప్పుడు పోలీసులకు రిపోర్టు ఇవ్వవలసింది. లేకపోతే నిమీద కేస్ పెట్టవచ్చు."

చికాకు కల్గించింది యాజుల్కు. వల్లగౌనులు తొడుక్కుని, విగ్గుపెట్టుకుంటూ అక్కడ ఆ కాకినాడ కోర్టులో, దోషిని ప్రశ్నించినట్లు, బెదరించినట్లు ఇప్పుడు తన్ని చెయ్యడం, కోపం తెప్పించింది. అయినా తమాయించుకున్నాడు.

"ఆ రిపోర్టూ ఇచ్చేను." నెమ్మదిగా జవాబు చెప్పినా, గుండెల్లోంచి, ఇచ్చిన సన్నివేశమూ, ఇప్పించిన వ్యక్తులు, వ్రాసిన విధానమూ సజావుగా లేదు. అల్లా చేసినందుకు నీకు ఇండియన్ కాన్‌స్టిట్యూషన్‌లో ఫండమెంటల్ రైట్సునే ఉల్లంఘించేవు అన్న వణుకు పుట్టింది. 'దేవుడా ఆయన మరింత చిత్రవధ ఆ విషయంలో చెయ్యకుండా వుంటే కొబ్బరికాయ కొడతాను' అనీ మొక్కుకున్నాడు.

"చూచేరా! మా యాజులు తెలివితేటలు, దూరపు ఆలోచనా" అని ఆఫీసరుగారు కళ్లు మిలమిల్లాడించుకుంటూ ఆయనవైపు చూచేడు.

"పత్రికలో ఇచ్చినట్లుగా ఆవిడ ఆకారం పోలికలు సరిపోయేయా?"

"చిత్తం" అన్నాడు.

సమస్యే అయినట్లయ్యింది ఆయనకు. కాస్సేపు మాట్లాడలేక పోయేడు. ముందు ఏవిధంగా దారి త్రొక్కాలా అన్నదే నిర్ణయంకాలేనట్లు ఉన్నాయి చూపులు.

"మీ ఇంటికే ఏకటాకీని రావడానికి కారణం?"

"వీడెక్కడ దాపురించేడురా తండ్రీ నాపాలిట" అనేటట్లుగ దొరవైపు ఓసారి నమ్రతతో చూస్తే, ఆయనా గ్రహించేసినట్లుగానే తలపంకిస్తూ "ఆయన కూతురు ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయింది. సుబ్బారావుగారి కొడుక్కు ఇద్దామనుకుని తాంబూలాల వరకూవస్తే, తనకి అక్కర్లేదని, తప్పించుకోడానికే చేసింది. ఆయన..." ఇక చెప్పనక్కరలేదన్నట్లు ఆగిపోయేడు. ధైర్యం వచ్చింది.

"పరీక్షకు కూర్చున్నా. ఇంగ్లీషులో కాస్త లోగసానుగా వున్నట్లువుంది. వెంకట్రామయ్యగారు పంపేరు. మీరు సహాయం చెయ్యగలరూ అని..."

"ఎవరా వెంకట్రామయ్యగారు?"

"ఆయన బెజవాడలో మంచి పేరు మోసిన క్రిమినల్ లాయరు అని తెలిసిందండి."

"మరి మార్కులు వేయించేవా?" దొరకళ్లల్లో చిలిపితనం కన్పించింది.

తలవంచుకుంటూనే, వినబడీ వినపడనట్లు "చిత్తం" అనేసేడు.

ఉత్సాహంలో ఒక్కసారి "యు ఎపియర్ టు బి ఎ టెరిబుల్ ఫెల్లో" అన్నాడు దొర.

ఆయన వినిపించుకోనట్లే "నా పోలిక లేమైనా ఆ అమ్మాయిలో ఉన్నాయా?" అందులో ఆ వ్యక్తి హృదయంలో జరిగే యుద్ధం బాగా స్ఫుటమైంది.

చాలా ఇంటరెస్టెడ్‌గా వున్నట్టు, పైపులో మళ్లీ పొగాకు నింపి, వెలిగించి గుమ్మని వదిలేసేడు దొర. "అదా!" అంటూనే లేచి హుషారులో గోడ మీద స్విచ్ వేసేడు. భళ్ళున తెల్లారినట్లు వరండా వెలిగిపోయింది.

పదిరోజులు శ్వాసల సాహచర్యం, అంత రాశంలో కొంత చిలిపితనాన్ని ప్రోత్సహిస్తే ఈయన్ని, మొఖం అటు తిప్పండి, ఇటో, వేరుగానో, కళ్ళు కదల్పండి, గలిపీల్చుకోండి అని కొంత బజాయిద్దామన్న తలంపు మెదిలింది. నోటి చివరవరకూ వచ్చిన ప్రశ్నలు సంభాళించుకుంటూనే "చాలా మటుకు వున్నాయనుకుంటా" అని ఆఫీసుల్లో పార్టీలకు ఇచ్చే పైమాయిషు నామాలా సమాధానం ఇచ్చేశు.

గట్టిగా నవ్వేసేడు దొర.

సిగ్గు వచ్చింది యాజులుక్కూ. ఆయన కూడా చిరునవ్వు పైకెళ్ళగక్కకుండా ఉండలేకపోయేడు.

"థాంక్స్. నువ్వు వెళ్ళవోయ్." అన్నాడు ఆయన. దొర తలూపేడు.

లేచి, నమస్కారాలు చేస్తూనే, మెట్టుదగ్గరకు వచ్చే టప్పటికి "పేరేమని చెప్పిందోయ్" అడిగేడు ఆయన.

"ఏంతె వరకూ చెప్పలేదండి"

"ఆ!" అన్న ఆశ్చర్యం ఆయనా, "ఈజ్ ఇట్ ట్రూ" అని దొర నోరు వెళ్ళబెట్టేసేరు.

మెట్లుదిగి, పోర్టికోలోకి వచ్చేసరికి యాజులుక్కూ "వెరీ లకీ ఫెలో" అన్న దొరమాటలు వినపడితే, మేఘాల మీదనే ఎగిరిపోయినట్లయ్యింది. గబగబా అడుగులు వేసేడు. అర్ధరూపాయి ఇచ్చి రిక్షా కుదుర్చుకున్నాడు నేరుగా చౌరస్తాకంటూ. ఇలాంటి సమయంలో ఓకప్పు టీ తాగితేనే కాని వుండలేనట్లు టీహోటల్లో మైమరపులో మళ్లీ పొదలైన తలంపుల్ని 'ఖుదేగవహా' అన్నట్టుగానే జోసఫ్ వచ్చి "ఏమండీ! మా ఇంటికి అసలే రావడం మానేసేరు. పోలీసు సబ్ ఇనస్పెక్టరు కేపు వాళ్ళిద్దర్నీ ఎరస్టు చేస్తారన్నాడు, మీకు తెలుసా?" అంటూనే ఇదిగా చూస్తు చతికలపడ్డాడు.

ఆవిడ రావడంతో లిల్లీకి సమాధికట్టేసేను అనుకుని తృప్తిపడ్డ యాజులుక్కూ, దాని తమ్ముడు ఇప్పుడు ఇల్లా చెప్పడం, కడుపు దేవేసినట్లయ్యింది. మాట్లాడకుండానే టీ వాడికీ తెప్పించేడు.

కృతజ్ఞత అన్నట్లుగా "అక్కయ్య మీకోసం ఏ రోజు కారోజే ఎదురుచూస్తోంది. నిన్న ఏడ్చేసింది కూడాను. ఆయన్ని చూడలేందే వుండలేనని గోలచేస్తే అమ్మకూడా బావురుమనిపోయింది 'వస్తారె! కొంత వాళ్ల పని ఆమీతూమీ తేలిపోయేవరకూ రారు. వస్తే ప్రమాదం కూడాను' అని నేనింతో చెపితే, ఇవ్వాళ కొంత అన్నం తింది."

వింటుంటే - ఏదో కార్యరీత్యా వచ్చి ప్రాథేయపడ్డ ఆవిడ చుట్టూ తనే ఓ బ్రహ్మచెముడు డొంక అల్లి, దానికి నీరుపోసి, ఎరువువేసి పెద్ద జీమూతంలా చేయగా, ఆఖరుకు అది బ్రరెంక డొంకలా ప్రాకితే, మారిన తోటమాలి పరిస్థితిలో, అందులోంచి ఎల్లా పైకి తియ్యాలి, ఈ డొంకని ఏ విధంగా మంటపెట్టాలి అన్నది తన చేతులు దాటిన విషయంలా తట్టింది. తను ఎంత మూర్ఖుడు, మూఢుడూ అని అనుకున్నా, చేతులు కాలిం తర్వాత ఆకులు పట్టుకోవడం వృథా అవుతోంది. మొదటనుండీ తన జాతకమే అంత. హృదయం లోడ లోడలాడిపోయింది.

"చిన్నాయన కూడా అన్నాడు. ఆయనకు పెద్ద దొరదగ్గర మంచి పలుకుబడి, గౌరవం ఉందని, మాట నికార్సయిన మనిషి అని. చేసిన వాగ్దానం నిలుపుకుంటాడని, తప్పకుండా నిన్ను పెళ్ళి చేసుకుంటాడని." జోసెఫ్ వదల్లేదు.

ఎర్రతేలు కుట్టినట్లయ్యింది. ఏమీ జవాబు చెప్పలేని శూన్యంలో నే లేచేడు.

"క్రొత్తగా సర్కస్ వచ్చిందండి. చాలాబాగా వుందట. వెళదామా?" జోసెఫ్ వెంట పడ్డాడు. యాజులకు తెలుసు, తను కళ్లపడితే తృ[illegible]మో ఫ[illegible]మో చేతిలో పడేస్తేనే కాని వదలడని. జేబులోంచి రెండు రూపాయల కాగితంతీసి చేతులో పెట్టి "ఇప్పుడే ఆఫీసునుండి వస్తున్నాను. నువ్వు వెళ్ళు" అనేసి అడ్డబడ్డాడు ఇంటికి.

'కింకర్తవ్యం' ఇదే ప్రశ్న అడుగడుక్కూ వెయ్యి కంఠాల స్వరమేళంతోనే ఎదురయ్యింది; చెవులు గింగురెత్తేటట్లు హోరెత్తింది. ఒళ్ళంత చెమటలే పోసేయి. ఓపెద్ద ఆవిడ, తన ఆరాధనమూర్తి; రెండో పెద్ద పోలీసులు, లిల్లీ, దాని పరివారం. పెద్దదొర. ఆయనా, మామగారు, బొద్దు మీసాలు, శ్రీపతి, రామారావు. వాళ్ళ సంసారాలు, ఇంటావిడ, వెంకట్రామయ్య. ఆఖరుకు తన తండ్రి, వదిలిపెట్టిన పెళ్ళాం. ఆ తెలియని వార్తలు అందజేసే వ్యక్తులు, ఒక్కొక్కళ్ళే ఎదురై తన నానరాన్ని కణకణాన్ని చిత్రవధ చేసేట్లుగా, వాడికత్తులు పుచ్చుకుని నుంచున్నట్లయ్యింది. ఏదో వైతరిణీనది దాటాలని అన్నది, ఇప్పుడే కొళ్ళముందే ఉన్నట్లయితే, నిస్సహాయతలో నిష్పృహలో, భయంలో, పిరికితనంలో, యాజులు నట్టనడిసముద్రంలోని నావే అయిపోయేడు.

ఏవిధంగాను చుక్కాని దొరికేటట్టు కన్పించలేదు. తను ఓటమిని అంగీకరించి ఆద్యంతాలు ఆవిడకు చెప్పి 'త్వమేవ శరణం మమ' అంటే బాగుండు అన్న ఒక్క ఎండమావుల ఆశతప్ప. అదే బీజం మొలక వృక్షం అయితే, ధైర్యం వచ్చింది; బలం వచ్చినట్లయింది. అడుగులు చురుగ్గానే పడ్డాయి.

ఎదురుగా ఆవిడే తలుపుతీసి, ప్రక్కగా నిలబడి వుంటే, పూర్ణంగా కళ్ళల్లోకి చూచి ఆ ఆర్ద్రత ప్రతిబింబంలోకి మనస్సునింపుకుని కుర్చీలో కూలబడి పోయేడు. లైటు టేబిల మీద పెట్టి, దగ్గరగా వస్తూనే "ఏమైంది? దొర ఏమైనా అన్నాడా? ఏం జరిగింది? తిట్టేడా? సస్పెండు చేసేడా? చెప్పండి?" ఒకదాని వెనుక ఒకటె ప్రశ్నలు కురిపించేసింది; చూపులు తప్ప మరొకటి లేని యాజుల్ని చూసి కంగారూ పడింది.

"శ్యామూ కాస్త కాఫీ ఫ్లాస్కులోది తీసుకురా బావగార్కి" అనేసింది ఒక్క కేకలో. అందులోని స్వరం సప్తలోకాలు ఆహుతైనట్టే పొంగింది. పమిట చెంగుతో మొఖం తుడుస్తూనే, ప్రేమ కట్టలు తెగి వరదలైనట్టే "ఏం జరిగిందో చెప్పరూ? నా గురించైనా చెప్పరూ?" దేహీఅన్న ప్రాధేయత అన్న పూర్ణ స్వతవులాగే వుంది.

కదలిపోయేడు; కరిగిపోయేడు; ఈ ఏకాకి జీవితంలో జ్యోతులు వెలిగించిన ఆవిడ ఎదురుగా ఎలుగెత్తి తనకోసం, తనఉన్నతి, భావి, సర్వస్వంకోసం, చేతులుచాచి, హృదయానికి హత్తుకున్నట్లువుంటే. అప్రయత్నంగానే హృదయం ఆర్ద్రపడిపోయి కన్నీళ్ళు కారేయి యాజుల్కు. నిలువు దోపిడీ అయినట్టే ఆవిడ రుద్ధకంఠంలోని రక్తనాళాలు పొంగిపోతూంటే, కుర్చీ చెయ్యిమీద తలపెట్టేసి బావురుమనిపోయింది.

హృదయం ఒక్కసారి తూర్పారబట్టినట్లే జబ్బలు పట్టుకుని లేవనెత్తి, తనవైపు లాక్కున్నాడు యాజులు. కరిగిపోయింది ఆశ్లేషంలో ఆవిడ. ఆ క్షణంలో ఇరువురూ లేనట్లే అయ్యేరు.

కంగారుగా వస్తున్న శ్యామలఅలికిడి విని దూర దూరం అయిపోయేరు. ఇచ్చిన కాఫీ కళ్లు తుడుచుకుని చప్పరించేటప్పటికి, ఆవిడ మెళ్లో మంగళసూత్రాలు కనపడితే, 'శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదురా నాయినా' అనికళవళపడిపోయి, 'మీకు పెళ్లయ్యిందా?' అన్నాడు.

ఒక్కదూకులో ఆవిడ లోపల్కి వెళ్లిపోయింది.

శ్యామల ఫక్కున నవ్వేస్తూనే "ఇంత వెర్రి బావగారు ప్రపంచంలో ఎల్లా బ్రతుకుతారండీ? ఇప్పటి కాలపు నగల సంగతి తెలియక అవి మంగళసూత్రాలు అనుకుంటున్నారా!" అంటూ హేళనలోకి దిగింది.

"అయితే...అవి"

"వాట్లపేరు టి. వి. చెక్ లేసు లండీ!"

"నిజంగా? అంటే?"

తల ఆమూలనుండి ఈ మూలకు త్రిప్పుతూ "భలే వాళ్లు, కాఫీ త్రాగండి, చచ్చేంత నిద్దర వస్తోంది నాకు" అంటూనే తుర్రుమంది. టి. వి. అంటే అర్థమే కాలేదు ఆ రాత్రల్లా పాడి కళ్ళయినా యాజులుకు.

* * * *

"ఇంకా లేవలేదండీ! లోపలికి వచ్చి కూర్చోండి" అని శ్యామల గొంతుక వినపడితే "ఎంత మొద్దునిద్దరబోయేను అనుకుంటూనే, వళ్లువిరుచుకుని, దొడ్లోకి వెళ్ళేడు; కాలకృత్యాలకు.

వంటింటిలో అడుగుపెడేసరికే ఆవిడ "గుడ్ మార్నింగ్, రాత్రి బాగా నిద్రపోయేరనుకుంటా" అని నవ్వుతూ సిగ్గదొంతర్ల మధ్య అడిగింది.

బద్ధకం అంతా పటాపంచలైనట్లే హుషారు వచ్చేసింది. పొట్లపువ్వే అయి "ఏమండీ! టి. వి. అంటే ఏమిటి?" అన్నాడు.

"దాన్నే అడగండి. మీ ఆఫీసు సైన్యం అంతా వచ్చినట్లుంది. పరామర్శకా?"

"ఎందుకనీ?"

"మరి రాత్రి ఏదో జరిగిందిగా! ఎంత అడిగినా చెప్పకుండా గునిసేరు. దానికే."

నవ్వేసేడు, ఆ ఓపెనకోపం రెండో పెడ ఏమిటో తెలియని మాధుర్యంలో అన్నమాటల్కు.

శ్యామల వస్తూనే "ఓహో! బావగారు పొద్దుటే నవ్వేస్తున్నారు. మరి రాత్రి మర్చిపోయేరా! నడవండి అక్కడ రథులు, అతిరథులు, మహారథులు తహతహలాడిపోతున్నారు తమదర్శనానికి."

"కాఫీలు ఇవ్వాలా?" ఆవిడ.

"తను దయా! మా ప్రాప్తినీ" అంటూనే గుమ్మందాటేడు. రహస్యం అన్నట్లు టి. వి. అంటే అడిగేరే నన్ను అని చేప్పేసింది కస్తూరి. దాంతో గుసగుసలూ, పాడేలు వెయ్యడం, పంచదార కలపడం జరిగేయి. నవ్వులూ పొంగేయి పాలల్లా.

ఎదురుగా, పెద్దగుమాస్తా, చింతామణి, తోడు అన్నట్లు శ్రీపతి, రామారావు ప్రభృతులు అంతమందీ కట్టకట్టుకు రావడం ఆశ్చర్య పరచింది.

"ఏం యాజులూ! ఈ ముసలివాడు ఏం కాగితాలైనా సంతకాలు పెట్టాలా? నిన్నొకటి అయ్యింది ఆచండశాసనుడి చేతుల్లో" అడిగేడు పెద్ద గుమాస్తా, వయస్సు మళ్ళిన స్వరం వణుకుతుంటే.

"ఏం లేదు. అంతా సవ్యంగానే వెళ్ళింది." అంటూనే "ఏదో ప్రవేటు పనికే పిల్చేడు" అని తేల్చేసేడు.

"నిన్నటినుండి పిసుక్కు చచ్చిపోతున్నాం, ఆ వరస చూస్తే నిన్నుకూడా ఏదో చేసేసేవుంటే హెడ్ గుమాస్తాగారు రాత్రల్లా నిద్రపోలేదు. నాకు జాగారమే" అన్నాడు చింతామణి.

తర్వాత ఏవో ఏవో కబుర్లు కాఫీకప్పులమీద వెళ్ళేయి. వర్ణనలూ జరిగేయి. వెళ్ళుతాం అని లేస్తున్నప్పుడే హెడ్ గుమాస్తా "యాజులూ! ఇన్నాళ్ళయి సంసారం పెట్టినా, కొత్త అమ్మాయి వచ్చిందని చెప్పేవు కావేం." అంటూనే లోపల్కి వెళ్ళిపోయేడు. సిమెంటు వేసినట్టుగా యాజులు కుర్చీకే అతుక్కుపోయేడు మిడిగుడ్లు వేసుకుని.

"అమ్మాయీ" ఆయన పిలుపు.

బిలబిలా ఇద్దరూ వచ్చేసేరు. వయస్సుకు నమస్కారం చేసేసేరు. ఎవరు యాజులు భార్య. అడగలేని అభిజాత్యంలో "నేనూ ఆ యాజులూ ఒక్క ఆఫీసులోనే పనిచేస్తాం అమ్మా!" అన్నాడు. మంచిదంటూనే సందిగ్ధపు సవాలు మొఖంమీద ప్రతిబింబించుకుంటూనే వీధిలోనూ పడ్డారు.

"ఏమండి! శ్రీపతిగారూ, ముసలివాణ్ణి. పైగా చత్వారం. ఈ కాలపు పోకడలు నాకేం తెలుసూ. ఒకే వయస్సు, ఒకే ముఖాలు ఒకే విధంగా బట్టలతీరు, ఇద్దరున్నారు. ఇద్దరి మెళ్ళోనూ నల్లపూసలు కాని నానుతాడు కాని కన్పించనేలేదు. అందులో ఎవరండి యాజులు భార్య?"

తెలియని చింతామణి, అంగులో సగంగా శ్రీపతి రామారావులూ కూడా తల గోక్కున్నారు, ఏం చెప్పాలా అని. అంచనా వేసినా, శ్రీపతికి ఎదుటి దెబ్బ తగుల్తుందేమో అన్న భయమూ వేసింది.

రామారావు ఉండబట్టలేకనే "వాళ్ళిద్దరూ కూడా యాజుల్కి ఏమీ అవరు" అనేసేడు చల్లగా.

"ఆ!" నోరు తెరిచేడు పెద్ద గుమాస్తా.

"మరి...?" చింతామణి ప్రశ్న మొఖం పెట్టేడు.

నెమ్మదిగానే, తన ఇంటికి రావటం, ఉత్తరాలు వ్రాయించటం, పేపర్లుకొన్న అనుమానం, లెక్చరర్ గారింటికి వెళ్ళినవయినం వగైరాలన్నీ ఏకరువు పెట్టాడు.

"బుద్ధిమంతుడు, వృద్ధిలోకి రావలసినవాడు అనుకున్నా. ఇంత పోకిరిగా వుంటాడా! ఉండు వాళ్ల నాన్నకు ఉత్తరం వ్రాస్తాను వెంటనే రమ్మని, ఆ మామగారికి కూడా?" నిప్పులు క్రక్కుతున్నట్లే అన్నాడు హెడ్ గుమాస్తా.

"మామగారా?" శ్రీపతి మధ్యలో అడిగేడు.

"ఓహో! ఆ సంగతి మీకు తెలియదు కాబోలు" అంటూనే వివరాలు చెప్పేడు. అందరూ విస్తుపోయేరు.

"వీలైతే మీరు పెద్ద దొర చెవిని పడేస్తే నాల్గు చివాట్లు వేస్తాడు. దాంతో కాని తిక్క తిరగదండి! ఆ పనిచేస్తే వాడికి చాలా ఉపకారం చేసినవాళ్ళవుతారు." శ్యామలన్న మాటలు మనస్సులో పట్టిపోతే ప్రతీకారంగా, మిరపకాయ అయ్యేడు శ్రీపతి పెద్ద సలహాదారులా.

"అదేమిటి? మొన్న మావాళ్ళూ, శ్రీపతి భార్యా చూడ్డానికి వెళదామనుకుంటే నిర్మొఖమాటంగా రావద్దని అనేసేడండి. పైగా వాడిలో కొత్త ముఖం చిట్లింపులు కన్పిస్తూనే వున్నాయి కూడాను" కుర్ర మోకుతనంలో తనకు ఏ రహస్యాలూ చెప్పకుండా, గాడిదచాకిరీ చేయించుకున్నాడన్న భావంతో రామారావు వేసేడు సమిధ.

"అంతపని జరిగిందా?" అన్న ఆశ్చర్యంలో మొగలోనే నుంచుండిపోయి చర్చలు ప్రారంభించేరు. అందులో రిక్షావాడి గంట కూడా వినిపించనేలేదు. "అయ్యా దారి" వాడు అరుస్తూనే వున్నాడు.

ఈ తప్పులోని వాళ్ళు ఎంతవింతగా వుంటారో అన్న ఆశ్చర్యంతో, బెడ్డింగుమీదుగా వంగిచూచేడు వెంకట్రామయ్య. తల నెరపులు సమానం అనుకుంటూనే "యాజులుగారి ఇల్లు ఎక్కడండి? ఆయన ఆ ఆఫీసులో పనిచేస్తూ వుంటారు!" అని అడిగేడు.

"ఆవరసలో మూడో ఇల్లు" అని అనేసినా గుడ్లన్నీ గూబల్లో పెట్టుకుని, సతమతమయ్యేడు శ్రీపతి. 'ఎవరు చెప్పారు' అన్న చూపులు కళ్ళజోడు వెనకాల వుండిపోయేయి. అగ్నిపర్వతం బ్రద్దలైపోతుందన్న ఉత్సాహం రామారావులో వుంటే, చింతామణి, 'తను మళ్ళీ ఆఫీసులో పునఃప్రవేశానికి ఆయనే అండ, ఏం జరగకూడదు దేవుడా' అన్న తహతహ కనపరిచేడు.

ఆయన మెట్లు ఎక్కేడు. అంతవరకూ వెనుక చూపులు చిల్లులు పొడిచే, ముందుకు సాగేయి మనం ఇక్కడ వుండటం మంచిదికాదని.

ఎవరా అనుకున్న సంశయం ఊగిసలాడితే, పులుకు పులుకు ఓసారి చూచి, అనమాలుకట్టేసి, ఒక్క గొంతులో శ్యామలా, కస్తూరి "నాన్నా" వచ్చేవా అనేసి చెరో పెడా గునిసేరు. మొఖాలు పొంగిపోయి నవ్వుల ముసుగులే అయ్యేయి.

స్తబ్ధు అయిన యాజుల్ని లేపినట్లుగా "వీరు మా నాన్నగారు" అంది శ్యామల

"మరి ఆయనెవరు?"

"ఆయన యాజులుగారు. ఆఫీసులో ఉద్యోగం. ఎంతో మంచివారు నాన్నా. ఇన్నాళ్ళూ ఇక్కడే వుండిపోయేం."

చిరునవ్వు నవ్వినా "ఏం అబ్బాయి! ఏదో వచ్చినపని ఘంటల్లో చేసి పంపెయ్యక ఆ పెళ్ళి అనవలసిన పిల్లల్ని ఇల్లా రోజులతరబడి అట్టేపెట్టేస్తే ఏమవుతుందో తెలియదయ్యా! ఎప్పుడు ఇల్లు కదలనివాడిని కదలించేవు కదా! రేపొద్దున్న ఇదే ఒట్టబయలు అయితే ఇంకొకడు పెళ్ళి చేసుకుంటాడయ్యా!" అని నిలబెట్టినట్లు అన్నాడు వెంకట్రామయ్య.

'ఇదెక్కడి అభాండం రా బాబూ' అంటూనే దోషిత్వం వహించేడు యాజులు. ఏం చెప్పాలి జవాబు తెలియనేలేదు.

"అల్లా బెల్లంకొట్టిన రాయిలా మొఖం వంచుకుంటావేమయ్యా! మాట్లాడవేం?"

వాళ్ళిద్దరూ కిలకిలమంటుంటే, కేవులతో జేసినట్లయి కళ్ళు మూసుకున్నాడు. ముందుగా యాజులు మామగారు, బొద్దుమీసాలు, ఆ వెనుక అత్తగారు వచ్చి నుంచున్నట్లే గుర్తులేదు యాజుల్కి. చీకట్లో ఏదో

యమపాశం లాక్కు వెళ్లుతున్నట్టే అయితే, కణతలమీదుగా చేత్తో కళ్ళు రాచుకున్నాడు. మాపుల్లోనే చిరునవ్వులు వెళ్ళాయి కస్తూరి అమ్మవారిదివిలో కొత్త పెళ్లి కూతురే అయ్యింది.

"యాజులుగారూ!" వీధిలో బూట్ల చప్పుడు. తలెత్తేడు. ఎదురుగా వున్న వ్యక్తులు, ముఖాల్లో నవ్వులూ. ఆవిడ కనుపులు, శ్యామల పొట్లపువ్వు. పై ప్రాణాలు పైనే ఎగిరిపోయేయి యాజులుకు. లేవనే లేకపోయ్యేడు. రాళ్ళవర్షం!

వచ్చిన సబ్ ఇనస్పెక్టరు. ఆ వెనుకాలవున్న సీతారామారావుగార్కి, ఎవరూ ఏం చెప్పనక్కర్లేనట్టే అర్థం అయిపోయింది. ముఖాలు పులకితం అయిపోతే, సీతారామారావు పదిరూపాయల కాగితం బంట్రోతు చేతులో పెడుతూనే "నిముషాలమీద మిఠాయి తీసుకురా" అని పురమాయించేసేడు.

ఎదురుగా వెంకట్రామయ్య వెళ్ళుతూ "రండి బావగారూ!" అన్న ఆహ్వానమూ పంపేడు. సీతారామారావుగారికి.

కంగారుపడుతూ, ఏంచెయ్యాలో తెలీయక, లేవాలని, కూర్చోవాలని, చేతులెత్తి నమస్కారం పెట్టాలని, మర్యాదా చెయ్యాలని ఊగింపుల్లో, ఊయ్యాలే అయ్యింది యాజులుమనస్సు.

అందరూ కూర్చునే వుండిపోయేరు, సంతోషం పట్టలేక. మిఠాయి వచ్చేసింది అంచెలమీద.

"అమ్మాయి కస్తూరీ! ఇల్లారా!" అనేసేడు వెంకట్రామయ్య.

పొట్లం విప్పుతూ, సిగ్గేతనైన కస్తూరికి అందిస్తూ, "ఆయననోట్లో పెట్టమ్మా" అన్నాడు సీతారామారావుగారు.

అందరినోళ్ళూ తీపే అయిపోతే, పెదిమిలకు అంటిన పంచదార తీపిల్లోంచి యాజులు గతం ప్రస్తుతాలమధ్య ఊగిపోయి, అంబరం ఎక్కేస్తూనే, బాబుగారి చేతుల్లోంచే మిఠాయి అందుకుంటూ నవ్వుల పువ్వులైన కస్తూరినోట్లో "ఎంతనాటకం ఆడేవు" అన్న కసిలో క్రుక్కేసేడు.

అందరి మొహాలూ ఓసారి పూర్ణిమలే అయిపోయేయి; నెమిలికళ్ళే కూడాను.

"ఏమండీ! అసలు బావగారూ! ఇప్పుడేనా టి. వి. నెక్లెస్ అంటే అర్థం అయ్యిందా?" శ్యామల.

అందరికళ్ళూ మిలమిలలాడి, తెల్లబోయేయి.

"టర్మరిక్-వెర్మిలాన్ నెక్లెసండీ"

ముందుగా థర్మో డైనమిక్సు అనుకున్నాడు. కాని తర్వాతే ఏమిటో తెలీయక బుర్రగోక్కున్నాడు. వేలకు వేలు కేసుల్లో తీర్పు చెప్పిన సీతారామారావుగారు, దోషుల్ని నిర్దోషులన్న నిరూపణలో అందెవేసిన చెయ్యి వెంకట్రామయ్యగారు, మీసాలమీద నిమ్మపండు నిలబెడేటట్లు వంపులు దిద్దడంచేతైన రాజుగారు, ఒక్కరేమిటి అందరూ మొఖమొఖాలు చూసుకున్నారు.

"ఇంకా తెలీయలేదూ? ఇంగ్లీషులో పసుపు కుంకుమ భాగం అంటే మంగళసూత్రం కాదుటండీ స్త్రీకి" అనేసి చప్పట్లు కొట్టేసింది శ్యామల.

* * * *

పెద్ద కాళమేఘాలు. ఈదురుగాలి ఫెళఫెళల్లో ఉరుములూ మెరుపులూ ఉన్న ప్రకృతి ఒక్కసారిగా పుచ్చపువ్వులా విడిపోయినట్టే అయినా, యాజులు ఏదో ప్రశాంతయామినీ ప్రసన్నతలోకే వెళ్ళేడు.

పెట్టెలు, బెడ్డింగులు టాంగాలోకి ఎక్కాయి. మరచెంబులు చేతుల్లోనే ఊగేయి. బావమీద గౌరవము చనువు, చేసిన అల్లరి అన్నీ క్రమ్ముకుంటే. ఈ పిచ్చిబావను ఎల్లా వదిలిపెట్టి వెళ్ళడం అన్న ఆ వేదన పొంగింది శ్యామలలో. ఈ నాడు అర్థం అయిన అక్కయ్య లోతుగుండెలు ప్రక్కగా స్వగమేళం చేసే, ధైర్యంతోనే "బావా! వెళ్ళిరానా?" అంది. ఏవి ఎల్లావున్నా కంఠం రుద్ధం అయ్యింది.

ఒగ్గుకోలేని శూన్యంలో ఇద్దరూ కట్టాళ్ళే అయ్యేరు గుమ్మందగ్గర. అప్రయత్నంగా, ఆలోకాలోని పిలుపులు మెరుపులైతే, కళ్ళూ చెమ్మగిల్లేయి. కుర్చీలోనే జేర్లపడిపోయేడు.

ఇప్పుడు. ఈ మారిన రోజుల్లో, ఆరోజు జ్ఞాపకం వచ్చింది. అప్పుడూ తను అదే కుర్చీలో కూర్చున్నాడు, రేండెమ్ హార్వెస్టు పుటలు తిరగేస్తూనే. గుమ్మంలో కాలెట్టినప్పుడు ఆల్లాగే నుంచుని ఉండిపోతే, గుండెలు కొట్టుకున్నాయి. తలంపులు......

"ఇది భలానా సోమయాజులు గారి ఇల్లేనండి. లోపలిక్కి రండి, కూర్చోండి, కాఫీ త్రాగుతారా? వక్కపొడి ఇమ్మన్నారా?" అన్నాడు యాజులు.

"అల్లాగా అంటే" తలుపులు మూస్తూనే "నేను భలానా వారి అమ్మాయినండి. పేరు కస్తూరి. పంతొమ్మిది వందల ఏభైలో శ్రీ సోమయాజులు గారు నన్ను పెళ్ళి చేసుకున్నారు... కాని..."

"తెంపలు వేసుకుంటున్నా" అన్న రెండు ఎత్తిన చేతులూ మెళ్ళోకే సవరించుకుంటూ, కౌగిట్లో గువ్వపిట్టే అయిపోయి కువకువలాడింది కస్తూరి. విడియం వేసుకున్నవతున్న పెదిమల్ని అందిచ్చేసింది యాజుల్కి.

అంతే! కొమ్మకొమ్మకో సన్నాయే అయ్యింది.

* * *

తర్వాత ఎప్పుడో కస్తూరే అంది — "ఆ నరసారావుపేట అమ్మాయి ఎవరో కాదు. మీ చింతామణి భార్య." అంటే, గొంతుక బిగుసుకున్నంత పని అయింది యాజుల్కు. పతివ్రత అని చెయ్యెత్తి నమస్కరించిన రోజులు వుంటే, మళ్ళీ "రేండెమ్ హార్వెస్టు" పుటలు త్రిప్పనేలేదు యాజులు.